సాక్షి
సిద్దిపేట

సోమవారం । 23 । జనవరి । 2023



పట్నం.. పరవశం

కొమురవెల్లి(సిద్దిపేట): 'కోరమీసాల స్వామి.. మమ్ము దీవించు.. మా మొక్కులు స్వీకరించు'.. అంటూ భక్తజనం పారవశ్యంలో మునిగిపోయారు. ఆదివారం కొమురవెల్లి మల్లికార్జునస్వామి జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. జాతరలో మొదటివారాన్ని పట్నం వారంగా పిలుస్తారు. శనివారం సాయంత్రమే క్షేత్రానికి చేరుకున్న భక్తులు ముందుగా స్వామివారిని ధూళి దర్శనం చేసుకున్నారు. ఉదయం కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి, కోనేరులో స్నానమాచరించారు. గంగిరేణి చెట్టు వద్ద పట్నాలు వేసి మల్లన్న నామస్మరణ చేస్తూ మొక్కులు చెల్లించారు. అనంతరం గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మతో కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు. పట్నంవారం సందర్భంగా హైదరాబాద్‌తో పాటు పక్కరాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ధర్మ దర్శనానికి సుమారు ఆరుగంటల సమయం పడుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.


ఆలయం ఎదుట బోనాలతో శివసత్తులు

దారులన్నీ కొమురవెల్లికే..

నేడు (సోమవారం) స్వామి వారి కల్యాణ వేదిక వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఆలయ వర్గాలు నిర్వహించనున్నాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం హైదరాబాద్ ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

వైభవంగా మల్లన్న పట్నం వారం

నేడు పెద్దపట్నం, అగ్నిగుండాలు

పట్నం వారానికి వచ్చిన భక్తులు పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని తిలకించి స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం కొండ

భక్తులతో రద్దీగా మారిన క్షేత్రం

పోచమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు. పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బోనాలతో బారులు

ఆలయ ప్రాంగణంలో కిలోమీటర్ల పొడవునా భక్తులు బారులుతీరారు. ఒంటి నిండా బండారి (పసుపు).. చేతిలో ఈరకోలతో పోతరాజులు చేసిన విన్యాసాలతో ఆలయ పరిసరాలు దద్దరిల్లాయి. బోనాలతో భక్తులు గుట్టపై కొలువైన రేణుక ఎల్లమ్మ గుడికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న జాతరకు వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ 2 కి.మీ మేర విడిది ఏర్పాటు చేసుకున్నారు. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో ఆలయ అధికారులు విఫలం అయ్యారు. వసతి గదులలో ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నీటి సమస్య తలెత్తి భక్తులు ఇబ్బంది పడ్డారు. అన్నదాన సత్రం సమీపంలో డ్రైనేజీ లీకై మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో బోనాలతో వెళ్తున్న భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

పటిష్ట బందోబస్తు

పట్నం వారం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీసీపీ (అడ్మిన్) మహేందర్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 273 మంది పోలీసులు, 180 మంది ఎన్‌సీసీ విద్యార్థులు కొమురవెల్లిలో విధులు నిర్వర్తించారు.


గంగిరేణి చెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


బోనాలతో స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు


పట్నాలు వేస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

త్వరలో డయాలసిస్ సేవలు


దుబ్బాక ఆస్పత్రిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: పట్టణంలోని ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిలో త్వరలోనే డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే రఘునందన్‌రావు తెలిపారు. ఆదివారం ఉదయం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నివార్డులు కలియతిరిగి వైద్యసేవలపై ఆరా తీశారు. సౌకర్యాలపై సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీన మంత్రి హరీశ్‌రావుతో కలిసి డయాలసిస్ సేవలు ప్రారంభిస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, బీజేపీ నాయకులు సుభాశ్‌రెడ్డి, మచ్చ శ్రీనివాస్, వెంకట్‌గౌడ్, సుంకోజి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు కార్మికులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం చిన్నకోడూరులో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉచిత మోటార్ సైకిల్ అందిస్తామని బడ్జెట్ సమావేశాల్లో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు నిండిన కార్మికులకు రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లలో కార్మికులకు ప్రత్యేక కోటా ఇవ్వడంతో పాటు జిల్లాకేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, చంద్రం, రాజు, ఇబ్రహీం, ఐలయ్య, తిరుపతి, లింగం, రవి, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయం అద్భుతం


రాజ్యసభ సభ్యుడు బడుగు లింగయ్య యాదవ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

దుబ్బాకటౌన్: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన దుబ్బాక బాలాజీ ఆలయం అద్భుతంగా ఉందని రాజ్యసభ సభ్యుడు బడుగు లింగయ్య యాదవ్ అన్నారు. ఆదివారం ఆలయాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మద్దుల నాగేశ్వర్‌రెడ్డితో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ దంపతులతో పాటు బాధ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. ఆలయం వెనుక భాగంలో అర్చకుల నివాసాల ఏర్పాటుకు రూ. 40 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు చింత రాజు, నల్ల శ్రీనివాస్, కూర వేణుగోపాల్, ఆకుల దేవేందర్, ఎంజేబీ ట్రస్టు బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ


చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణలో నాయకులు

గజ్వేల్‌రూరల్: మండలంలోని దాతర్‌పల్లిలో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని రజకసంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ మున్సిఫ్ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక హాజరయ్యారు. వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్ సీఐ వీరప్రసాద్‌తో పాటు కొండపాక ఎంపీపీ సుగుణ దుర్గయ్య, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాంగారి శ్రీధర్, దుబ్బాక నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి నర్సింలులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు కల్పించాలి


మాట్లాడుతున్న పిట్ల రాజయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్టుగా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి, ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని టీఎస్‌పీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల రాజయ్య, చీఫ్ పాట్రన్ విశ్వనాథ సత్యం, మాజీ ఆర్థిక కార్యదర్శి సురేశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేటలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 317 జీఓతో నష్టపోయిన వారికి న్యాయం చేయాలన్నారు. అలాగే జీరో సర్వీస్ చేసి బదిలీలు చేపట్టాలని కోరారు. సంఘం పటిష్టతకు సభ్యులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొన్ని జిల్లాల్లో టీఎస్‌పీటీఏ పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించినట్టు తమ దృష్టికి వచ్చిందని.. అలాంటి వారిపై న్యాయపరమైన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్టో ఉపాధ్యక్షుడు సైదారావు, ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు స్వప్న, ఆలకుంట శ్రీనివాస్, విజయ్, ప్రశాంత్, వెంకటరమణ, మల్లన్న, శ్యాం మోహన్, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్ సమీపంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల (వర్గల్) ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావును సస్పెండ్ చేస్తూ గురుకుల పాఠశాలల సెక్రటరీ రోనాల్డ్‌రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ కావడంతో వెల్ఫేర్ పాఠశాలల సర్వీసు నిబంధనల మేరకు సస్పెండ్ చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు అప్పగించడంతో పాటు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


సుభాశ్‌చంద్ర

సిద్దిపేటఎడ్యుకేషన్: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మిట్టపల్లికి చెందిన చెన్నోజు సుభాశ్ చంద్ర ఎంపికయ్యాడు. ఈనెల 25 నుంచి 30 వరకు చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరుపున సుభాశ్‌చంద్ర పాల్గొననున్నాడు. ఈసందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్‌గుప్తా, నాగేంద్ర, పాలసాయిరాం, మల్లికార్జున్, తదితరులు సుభాశ్‌ను అభినందించారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమం


మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్

సిద్దిపేటఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, జిల్లా కార్యదర్శి సత్తిరెడ్డి అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం సిద్దిపేటలో జిల్లా అధ్యక్షుడు చల్లారపు తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 26న సిద్దిపేటలో రైతులతో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంట ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని పేర్కొన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపును నిలిపివేయాలన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతులు పండించిన పంటను పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా రైతులతో వ్యవసాయ మార్కెట్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న ట్రాక్టర్, బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు యాదవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కనకాచారి, సహాయ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సకల హంగులతో కొత్త బడి

- 'మన ఊరు- మన బడి'తో మారుతున్న రూపురేఖలు
- త్వరలో ప్రారంభానికి సిద్ధంగా 65 పాఠశాలలు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు:	976
మొదటి విడతలోఎంపికైనవి:	343
ప్రారంభం అయిన పాఠశాలలు:	341
పనులు పూర్తయినవి:	65
కేటాయించిన నిధులు	రూ. 126 కోట్లు
చెల్లించినవి:	రూ. 14 కోట్లు



నూతనంగా నిర్మించిన ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 'మన ఊరు- మన బడి' ద్వారా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. మొదటి విడతలో జిల్లాలోని 976 పాఠశాలలకు గానూ 343 ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో ఒక పాఠశాలకు స్థలం లేకపోవడంతో పనులు ప్రారంభించలేదు. మరో పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేశారు. దీంతో మొదటి విడతలో 341 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా తాగునీరు, మరుగుదొడ్లు, కంపౌండ్ వాల్, విద్యుదీకరణ, శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల స్థానంలో నూతన గదుల నిర్మాణం.. తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గతంలో అనేక ఇబ్బందులతో సతమతమైన ప్రభుత్వ పాఠశాలలు మన ఊరు- మన బడితో నూతన హంగులు సంతరించుకుంటున్నాయి. 341 పాఠశాలలకు మన ఊరు మన బడి ద్వారా రూ. 86 కోట్లు, ఉపాధి హామీ ద్వారా రూ. 40 కోట్లు కలిపి మొత్తంగా రూ. 126 కోట్లు జిల్లాకు కేటాయించారు. ఇందులో 55 పాఠశాలలకు గానూ ఒక్కో పాఠశాలకు రూ. 35 లక్షలకు పైగా నిధులు వెచ్చించారు. ఇప్పటికి పూర్తయిన పనులకు రూ. 14 కోట్లు టెండర్‌దారులకు చెల్లించారు. నిధుల కొరత లేకపోవడంతో పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. దీంతో గతంలో శిథిలావస్థలో కొట్టుమిట్టాడిన ప్రభుత్వ పాఠశాలలు నేడు కొత్త హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నాయి. త్వరలో జిల్లాలో పనులు పూర్తయిన 65 పాఠశాలల భవనాలను మంత్రులు ప్రారంభించనున్నారు.

పనులు వేగంగా సాగుతున్నాయి



మన ఊరు- మన బడిలో భాగంగా జిల్లాలోని 341 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. ఇందులో ఇప్పటికే 65 పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. త్వరలో మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో నూతన పాఠశాలల భవనాలను ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి, సిద్దిపేట

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

చేర్యాల(సిద్దిపేట): ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గీకురు కనకయ్య(52) ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డితో మాట్లాడగా ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

తల్లీపిల్లలు అదృశ్యం

జహీరాబాద్‌టౌన్: తల్లీ ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పరి పరశురాం, భార్య కల్యాణి, పిల్లలు చంద్రకాంత్, సాత్వికతో కలిసి పట్టణంలోని మేస్త్రీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం పిల్లలతో కలిసి భార్య ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. వారి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో జహీరాబాద్ టౌన్ పోలీసులకు పరశురాం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి మృతి

మెదక్ రూరల్: అప్పుల బాధ భరించలేక యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్ మండలం పాతూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సుంకరి రాజు(30) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల అతడి భార్య రేణుక అనారోగ్యానికి గురికావడంతో రూ. 2 లక్షలు అప్పు చేసి చికిత్స చేయించాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ ఎక్కువ కావడంతో కొంత కాలంగా మదనపడుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంకు వద్ద పురుగుల మందు తాగి తన స్నేహితుడు ప్రవీణ్‌కు విషయం చెప్పాడు. ఈ విషయాన్ని రాజు కుటుంబీకులకు తెలియజేయడంతో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీజిల్ చోరీ.. కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): పార్కింగ్ చేసిన డీసీఎం నుంచి డీజిల్ చోరీ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు ఆదివారం తెలిపారు. మండల పరిధి గోమారం గ్రామ శివారులో ఉన్న ప్రీమియం చిక్స్ అండ్ ఫీడ్స్ కంపెనీకి చెందిన డీసీఎంను సూపర్‌వైజర్ గిరిప్రసాద్ పార్కింగ్ చేశాడు. శనివారం అర్ధరాత్రి భోజ్యా తండాకు చెందిన బానోత్ నరేశ్ డీజిల్ చోరీ చేసినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థిపై దాడి..

సిద్దిపేటకమాన్: లైబ్రరీలో చదువుకుంటున్న ఓ విద్యార్థిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో సిద్దిపేట టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట నాసర్‌పూరకు చెందిన విద్యార్థి శ్రీనివాస్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం పట్టణంలోని సంతోషిమాత ఆలయం పక్కన్న ఉన్న గ్రంథాలయంలో చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో నర్సాపూర్‌కు చెందిన స్వామి ఇనుపముక్కతో వెనక నుంచి శ్రీనివాస్ మెడపై గాయపర్చాడు.

మూడేళ్లలో అభివృద్ధి జాడేది?

అసంపూర్తిగా రాజేశ్వరస్వామి ఆలయ గోపురం

- ఆలయానికి ఏటా రూ.40 లక్షల ఆదాయం
- దేవదాయశాఖ అధీనంలోకి వెళ్లి మూడు సంవత్సరాలు
- పునాదులకే పరిమితమైన సామూహిక మూత్రశాలల నిర్మాణం


అసంపూర్తిగా రాజగోపురం


నిలిచిపోయిన మూత్రశాలల నిర్మాణం

హుస్నాబాద్‌రూరల్: ఈశ్వరా భక్తుల కొర్కెలు తీర్చవా.. అంటూ పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామికి భక్తులు మొరపెట్టుకున్నా ఆలయ అధికారులు ఆలకించడం లేదు. మహాశివరాత్రిని పురస్కరించుకొని హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో జరిగే జాతరకు వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని కానుకలు సమర్పిస్తారు. ఆలయ అభివృద్ధి జరిగితే సౌకర్యాలు మెరుగుపడుతాయని భక్తులు విరాళాలు అందిస్తారు. జాతర సందర్భంగా రూ.25 లక్షలు, మరో రూ.15 లక్షలు దుకాణ సముదాయల నుంచి సమకూరుతుంది. ఇలా ఏటా ఆలయానికి రూ.40 లక్షల ఆదాయం వస్తుంది. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు అభివృద్ధి పనులకు అనుమతులు ఆలస్యం చేయడంతో మూడేళ్ల నుంచి అభివృద్ధి పనులు అడుగు ముందుకు సాగడం లేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- ఆరేళ్ల కిందట ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయ నిధులు రూ.1.10 కోట్ల రాజగోపుర పనులు ప్రారంభించారు.
- 70 శాతం పనులు పూర్తి కావడంతో దాదాపు రూ.75 లక్షల వరకు బిల్లులు చెల్లించారు.
- మరో రూ.30 లక్షలు ఖర్చు చేస్తే రాజగోపురం పనులు పూర్తి అవుతాయని తెలిసి కూడా అధికారులు పట్టించుకోవడం లేదు.
- గ్రామ పంచాయతీ పాలకవర్గంలో ఏర్పడిన విభేదాల కారణంగా ఆలయాన్ని 2019 డిసెంబర్‌లో దేవదాయ ధర్మదాయశాఖకు అప్పగించారు.
- అప్పటి నుంచి భక్తులు సమర్పంచిన కానుకలు, ఆలయ పరిధిలోని దుకాణాల నుంచి వచ్చే ఆదాయం ఆలయానికి సంబంధంచిన బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారు. సిబ్బంది వేతనాలు చెల్లించడం తప్ప ఒక్క అభివృద్ధి పని చేపట్ట లేదు.
- మహాశివరాత్రి ఉత్సవాలకు మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారు. ఏటా లక్షకుపైగా భక్తులు వస్తారు.
- భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు కోనేరు నిర్మించాలనే ఆలోచన కార్యరూపం దాల్చలేదు.
- గంటల తరబడి స్వామివారి దర్శనం కోసం వేచి చూసే భక్తులకు నీడ కోసం షెడ్డు ఏర్పాటు ఆలోచన చేయడంలేదు.
- సామూహిక మూత్రశాలలు నిర్మించాలని ఉపాధి హామి పథకంలో రూ.2 లక్షలు మంజూరు చేసినా ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి.
- పొట్లపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు పలుమార్లు విన్నవించడంతో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ నిధులు మంజూరు చేయించారు.
- పందిల్ల నుంచి పొట్లపల్లి వరకు తారురోడ్డు నిర్మించినా, పొట్లపల్లి నుంచి హుస్నాబాద్ వరకు మరో 900 మీటర్లకు నిధులు లేవని పనులు నిలిపివేశారు.
- స్వామివారికి భక్తులు సమర్పించిన కోడేలకు పాకల సౌకర్యం లేక ఎండలో ఎండుతున్నాయి.
- రూ.కోటి వరకు నిధులు ఉన్నా అధికారులు అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నారు.
- దేవాలయానికి పూర్తిస్థాయి ఈఓ లేకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
- మకర సంక్రాంతికి మల్లికార్జునస్వామి ఉత్సవాలు మొదలు మహాశివరాత్రి ఉత్సవాల వరకు పొట్లపల్లిలో దైవకార్యక్రమాలు జరుగుతాయి. దీంతో భక్తులు భారీగా వస్తుంటారు.

కమిటీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి పనులు



25 ఏళ్ల ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. ఏటా రూ.లక్షల ఆదాయం వచ్చే ఆలయానికి, స్వామివారి భక్తుల కోసం సౌకర్యాలు కల్పించకపోతే ఏట్లా? ఆలయ ఆదాయం తీసుకోవడమే తప్ప పైసా ఖర్చుచేసిన అనవాలు లేదు. ప్రభుత్వ అధీనంలో ఉంటే అభివృద్ధి జరుగుతుందని ఆశించాం. భక్తుల ఆశలను అధికారులు అడియాశలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రూ.కోటి నిధులు ఉన్నా రాజగోపురం పూర్తి చేయడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలి.

– కర్ర రవీందర్‌రెడ్డి, పొట్లపల్లి

మా శాఖ పనులు నిదానంగా జరుగుతాయి



మా దేవదాయ ధర్మదాయశాఖలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే అనుమతులు నిదానంగా జరుగుతాయి. ఆలయ నిధులు ఉన్నా కమిషనర్ అనుమతులు లేనిది అభివృద్ధి పనులు చేపట్టలేము కదా. ఆలయ నిధుల నుంచి రూ.70 లక్షలతో భక్తుల నీడ కోసం మండపం నిర్మించాలని ఆలోచిస్తున్నం. రాజగోపురం మిగిలిన పనులను సీజీఎఫ్ నిధుల కింద పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకపోయాం. ఆలయ నిధులు రూ.40 లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ చేశాం. మరో రూ.40 లక్షల వరకు బ్యాలన్స్ ఉంది.

– విశ్వనాథశర్మ, ఇన్‌చార్జి ఈఓ

క్రీడలు శారీరక దృఢత్వం పెంపొందిస్తాయి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

సిద్దిపేటఅర్బన్: క్రీడలు శారీరక, మానసిక దృఢత్వం పెంపొందిస్తాయని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్ అన్నారు. అర్బన్ మండలం తడ్కపల్లిలోని విద్యారణ్య ఆవాస విద్యాలయంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖేల్‌ఖుద్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శారీరక దృఢత్వం కలవారే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని విజయాలు సాధించగలరన్నారు. నేటి తరం తల్లిదండ్రులు కార్పొరేట్, ఏసీ స్కూళ్లకు మొగ్గు చూపుతున్నారని, ఆటలు, మైదానం గురించి ఆలోచించడం లేదన్నారు. దీంతో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి పెరిగి చిన్నచిన్న విషయాలు కూడా తట్టుకోలేని స్థితికి చేరుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే విద్యార్థుల మానసిక ఒత్తిడి దూరమై మానసికంగా బలంగా తయారవుతారన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా వీబీహెచ్‌ఎస్ భెల్ జోన్ నిలిచింది. కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం ప్రాంతీయ కార్యదర్శి ముక్యాల సీతారాములు, ప్రాంతీయ సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు, అడిషనల్ డీసీపీ మహేందర్

బతుకు జీవుడా!



మనిషి ఆటవిడుపు పరోక్షంగా జీవరాశిపై ప్రభావం చూపుతుంది. సంక్రాంతి సందర్భంగా ఎగురవేసిన గాలిపటాల మాంజా దారంలో చిక్కుకొని పక్షులు బలవుతున్నాయి. అందుకు నిదర్శనం సిద్దిపేట రిలయన్స్ మార్ట్ సమీపంలోని చెట్టుకు మాంజా దారానికి పక్షి చిక్కుకుంది. గమనించిన స్థానికులు ఆదివారం మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన హరితహారం ప్రత్యేక అధికారి ఐల్లయ్య సిబ్బందితో చేరుకొని లాడర్ సహాయంతో పక్షికి బంధవిముక్తి చేశారు.

– సిద్దిపేట జోన్

పూరిగుడిసె దగ్ధం


మల్లుపల్లిలో కాలిపోయిన పూరిల్లు

చిన్నశంకరంపేట(మెదక్): అగ్నిప్రమాదంలో పూరిగుడిసే దగ్ధమైన సంఘటన చిన్నశంకరంపేట మండలం మల్లుపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మల్లుపల్లి గ్రామానికి చౌదరిపల్లి నర్సింహులు కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరులేని సమయంలో పూరిల్లు కాలిపోవడంతో అనుమానంగా ఉందని బాధితుడు తెలిపాడు. ఆరు నెలల క్రితం తమ పెద్ద కుమారుడి వివాహం జరిగిందని, ఆ సమయంలో తెచ్చిన వస్తువులు కాలిబూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా బీరువాలో దాచిన రూ.50 వేల నగదు, ఐదు గ్రాముల బంగారు, 20 తులాల వెండి వస్తువులు ,ఇతర గృహోపకరణలు కాలిపోయాయని వాపోయాడు. సుమారు రూ.1.50 లక్షలు ఆస్తినష్టం జరిగిందని వెల్లడించాడు.

విద్యుత్ స్తంభం విరిగిపడి యువకుడి మృతి


లింగం (ఫైల్)

పాపన్నపేట(మెదక్): పొలం దున్నుతుండగా ట్రాక్టర్ గొర్రు తగిలి విద్యుత్ స్తంభం కూలి పడటంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి కొడుపాకలో ఆదివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిట్ల మల్లయ్య, శేకమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు లింగం (27) వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న పొలాన్ని ట్రాక్టర్ తో దున్నుతుండగా విద్యుత్ స్తంభానికి ట్రాక్టర్ గొర్రు తగిలడంతో అది విరిగి లింగం తలపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని మెదక్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పడికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ విషయంపై ఎస్సై విజయ్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

పూలవ్యాపారిపై దాడి: కేసు నమోదు

నర్సాపూర్‌రూరల్: అకారణంగా తనపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పూలవ్యాపారి ఆదివారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ పట్టణానికి చెందిన అర్షద్‌ఖాన్ పూలవ్యాపారి. కాగా ఇదే పట్టణానికి చెందిన మన్నన్ మద్యం తాగి దుకాణానికి వచ్చాడు. తన సెల్‌ఫోన్ కొనుగోలు చేయాలని కోరాడు. తనకు అవసరం లేదని అర్షద్ చెప్పడంతో ఆగ్రహించిన మన్నన్ అర్షద్‌పై దాడిచేసి గాయపర్చాడు. గాయపడిన అర్షద్‌ను అతడి సోదరుడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

317జీఓ సమస్యలు పరిష్కరించాలి

తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుముల మురళీధర్


మాట్లాడుతున్న మురళీధర్

చేర్యాల(సిద్దిపేట): 317 జీఓ సమస్యలు పరిష్కరించడంతోపాటు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుముల మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జిల్లాలకు ఉద్యోగుల కేటాయింపుల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలన్నారు.13 జిల్లాలకు సంబంధించి పెండింగ్‌లో పెట్టిన స్పౌజ్ అప్పీళ్లను పరిష్కరించాలన్నారు. జీరో సర్వీస్ అర్హతపై జిల్లాకు నూతనంగా కేటాయించిన ఉపాధ్యాయులకు బదిలీల్లో అవకాశం కల్పించాలన్నారు. పండిట్, పీఈటీల అప్ గ్రేడేషన్, నూతన పీఎస్ హెచ్‌ఎం పోస్టుల మంజూరు చేస్తూ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయ తిరుపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సిరెడ్డి, ప్రతినిధులు ఉదయ్‌ప్రకాష్, ఎస్.బాలభాస్కర్, సురేందర్‌రెడ్డి, ఎం.బాలభాస్కర్, రామాంజనేయులు, ఎం.వెంకన్న, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి


మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 317 జీవో ఉత్తర్వులో జరిగిన అన్యాయాన్ని సవరించాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న ఉపాధ్యాయులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను అరెస్టు చేస్తే సమస్య పరిష్కారం కాదని, విద్యాశాఖ మంత్రి, అధికారులు చిత్తశుద్ధితో ఆలోచించి, భార్యాభర్తల స్థానికతపై పునరాలోచన చేయాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం కృషి చేయకపోవడం వల్లనే ఉపాధ్యాయులు తమ ఆందోళనలు విభిన్న రూపాల్లో కొనసాగిస్తున్నారన్నారు. వారి ఉద్యమాలను అవహేళన చేస్తూ, ఉపాధ్యాయులను విద్యాశాఖ డైరెక్టర్ రౌడీలని కించపరుస్తూ సంభోదించడాన్ని టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నమల రాములు, జిల్లా అధ్యక్షుడు సిహెచ్ విజేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు పద్మయ్య, జానకి రాములు, సత్యనారాయణ, శివాజీ, నర్సింహారెడ్డి, మల్లేశం, సత్యకృష్ణ, తదితరులు పాల్గొన్నారు .

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్



కళాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సేవా భావం, నిరుపేదలకు చేయూత ఇవ్వాలనే సంకల్పంతో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో రీజియన్ పై మీట్ కార్యక్రమం రీజియన్ చైర్‌పర్సన్ వినోద్ ముబాని ఉజ్వల మోదాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ మాట్లాడుతూ కులమతాలు, జాతులకు అతీతంగా లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు తనను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. సమాజ హితం కోసం వారు చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు, వివిధ ఉన్నత హోదాల్లో ఉన్నవారు చాలా దూరం నుంచి రావడం శుభ పరిణామ న్నారు. సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు పూలదండలు, బొకేలు, శాలువాలకు స్వస్తి పలికి వాటి స్థానంలో తువ్వాలలు, నోటుబుక్స్ తేవాలని అందరికీ సూచించారన్నారు. మంత్రి హరీశ్ రావు చేపట్టిన కార్యక్రమాన్ని ఉత్తరాఖండ్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ఓ సమావేశంలో అందరికీ చెప్పి అమలు చేయాలని చెప్పడం చాలా గొప్ప విషయమన్నారు. అనంతరం మోదాని, ఉజ్వల దంపతులను గజమాలతో ఘనంగా సన్మానించారు. భరత నాట్యం చేసిన కళాకారులను ఎమ్మెల్సీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, లయన్ బాబురావు, నగేష్ పంపటి, లయన్ లక్ష్మీ, సిద్దిపేట క్లబ్ అధ్యక్షుడు గంప రమేశ్, కార్యదర్శి అమర్నాథ్, కోశాధికారి రవి, కొమురవెల్లి శేఖర్, ఈశ్వరయ్య, రమేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూమి దక్కకుండా పోతుందనే ఆవేదనతో..

- రైతు ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి
- కేసు నమోదుచేసిన పోలీసులు


కిష్టయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): రైతు తాను సాగుచేస్తున్న వ్యవసాయ భూమి తనకు దగ్గకుండా పోతుందనే మనోవేదనతో ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటన మిరుదొడ్డి మండలం కేంద్రంలో జరిగింది. మిరుదొడ్డి ఎస్సై శ్రీధర్ గౌడ్ తెలిపిన కథనం ప్రకారం వివరాల ఇలా ఉన్నాయి. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన రైతు మద్దెల కిష్టయ్య (73) 30 ఏళ్లుగా తన భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగించేవాడు. మండల కేంద్రంలోని 1452 సర్వే నంబర్‌లో ఉన్న 7 ఎకరాల వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన విజయేందర్ రెడ్డి దగ్గర 30 సంవత్సరాల క్రితం సాదాబైనామాలో కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి పంటలు సాగు చేస్తున్నాడు. అయితే కిష్టయ్యకు భూమిని విక్రయించిన విజయేందర్ రెడ్డి భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండానే మృతి చెందాడు. ఈ క్రమంలో విజయేందర్ రెడ్డి పాలివారు మర్పడగా విజయ, ఆమె మరిది విజయేందర్ కలిసి కిష్టయ్యకు తెలియకుండా అదే భూమిని అదే గ్రామానికి చెందిన బెక్కంటి దేవరాజు, మురళికి ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో ఆ భూమి తమదేనంటూ కిష్టయ్యను భూమిలో అడుగు పెట్టవద్దని హెచ్చరించారు. వీరికి రియల్ ఎస్టేట్ వ్యాపారులైన దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామానికి చెందిన డప్పు శివరాజం, వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాశమైనా దయాకర్, బైండ్ల నందు, మిరుదొడ్డికి చెందిన ఎలుముల కుమార్, మేడ్చల్‌కు చెందిన రామేశ్వర్, హైదరాబాద్‌కు చెందిన మర్పడగా రవీందర్ రెడ్డి సహకరించారు. కొన్నిరోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిని తాము కొనుగోలు చేశామంటూ పొలంలో ఉన్న బోరును ధ్వంసం చేశారు. దీంతో కిష్టయ్య తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 17వ తేదీన పొలంలో రసాయన గుళికలు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కిష్టయ్య కుమారుడు నర్సింహులు తన తండ్రి మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖేలో ఇండియా ఫుట్‌బాల్ పోటీలు షురూ


ఫుట్‌బాల్ కప్పును ఆవిష్కరిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు

- వర్గల్ వేదికగా టోర్నీ ప్రారంభం
- తొలిపోరులో విజేతగా గజ్వేల్ జట్టు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే మహిళా గురుకుల కళాశాల వేదికగా ఆదివారం తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఖేలోఇండియా అండర్–17 బాలికల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. గెలుపోటములు సమానంగా స్వీకరిస్తూ క్రీడాకారులు అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఆతిథ్య గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జీపీ ఫల్గుణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) డిప్యూటీ డైరెక్టర్ శరత్ చంద్ర యాదవ్, గోవా ప్రభుత్వ అదనపు కార్యదర్శి అజయ్ రామచంద్ర గౌడె, ఓఎస్డీ ఆకుల శివసాయికృష్ణ, మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆర్.నాగరాజు, వర్గల్ జెడ్పీటీసీ బాలూయాదవ్, ఎంపీపీ లతారమేశ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ కరుణాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేశ్, యస్.చక్రపాణి గౌడ్, పూలే పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఫుట్‌బాల్ క్లబ్‌తో..

టోర్నీ ప్రారంభోత్సవం అనంతరం తొలిపోటీ గజ్వేల్ ఫుట్‌బాల్ క్లబ్ శుభారంభం చేసింది. సిద్దిపేట ఫుట్‌బాల్ క్లబ్‌తో జరిగిన తొలి లీగ్ పోటీలో 12–0 గోల్స్ సాధించి విజేతగా నిలిచింది. శైలు 4, వైశాలి, సిరి, నందిని రెండేసి గోల్స్, అంకిత, తేజ ఒకటి చొప్పున గోల్స్ చేసి జట్టు విజయంలో ప్రధాన భూమిక పోషించారు. రెండో మ్యాచ్‌లో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టు 9–0 గోల్స్ తేడాతో దక్కన్ డైనమోస్‌ను ఓడించింది. నగ్మ 4, నందిని 2, రాజేశ్వరి 2, దివ్య ఒక గోల్ సాధించారు.